క్లుప్తంగా

కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలి

వెల్దండ: కాంగ్రెస్ పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలని మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో లేకున్నా కార్యకర్తలు పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పర్వత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శేఖర్, పుల్లయ్య, రమేష్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

వెల్దండ: నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి గ్రామస్థాయిలో కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలని మండల అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బూత్‌స్థాయి అధ్యక్షులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి కార్యకర్తలతో పార్టీ కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. కొంతమంది స్వార్థపూరితంగా కార్యకర్తలు మనోభావాలు దెబ్బతినేలా ఇష్టానుసారంగా కార్యక్రమాలను నిర్వహించరాదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సమీపిస్తుండడంతో మండల కమిటీని మార్చడంతో పార్టీకి తీవ్ర నష్టం కలుగుతుందని ఆయా గ్రామాల కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో అధ్యక్షుడిగా ఉన్న విజేందర్‌రెడ్డిని కొనసాగించాలని కార్యకర్తలు పేర్కొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



లింగాల: మండలంలోని పద్మన్నపల్లిలో ఆదివారం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అచ్చంపేట, నాగర్‌కర్నూల్ కమిటీల ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. అనంతరం శివరాత్రి పండుగ విశిష్టత గురించి ప్రజలలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాయిశేఖర్ శ్రేష్టి, మనోహర్, నిరంజన్, రమాదేవి, సుజాత, స్వప్న, చంద్రకళ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మాచారంలో కంటి వైద్య శిబిరం



మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో ప్రైవేట్ ఆస్పత్రిలో ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం రెండో రోజు కంటి సమస్యలతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన బాధితులకు అక్కడే ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలో పరీక్షలు చేశారు. రెండు మొబైల్ వాహనాలను గ్రామానికి తీసుకువచ్చి శస్త్ర చికిత్సలు కూడా శిబిరం వద్ద చేశారు.

13న ఉచిత కంటి వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో 13న జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ బీరం శివారెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి, క్యాటరాక్ట్ పొర ఉన్న వారికి కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. కంటివైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని కోరారు.

పేదలకు దుస్తుల పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలో ఎస్‌ఎల్‌వీఆర్‌డీ సంస్థ నిర్వాహకుడు కట్టా శ్రీనివాసులు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు ఆయన దుస్తులు, ఆహార పొట్లాలు అందజేశారు. పేదల ఆకలి తీర్చేవిధంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని అన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



తాడూరు: మైనర్ల వాహనాలు ఇస్తే యజమానులపై కేసు నమోదు అవుతాయని ఎస్‌ఐ పుట్ట మహేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వాహనాలు నడపాలన్నారు.

పనులు పూర్తి చేయకుండానే నిధులు



సైడ్ ఎర్తింగ్ పనులకు నోచుకోక కంకరతేలి దర్శనమిస్తున్న రామాజిపల్లి బీటీ రోడ్డు

- పనులు చేసినట్లు రికార్డుల్లో నమోదు
- అసంపూర్తి రోడ్డు పనులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

బల్మూర్: అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల కక్కుర్తితో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణాల్లో సైడ్ పనులు పూర్తి చేయకుండానే రికార్డులు చూపి నిధులు కాజేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో అంతర్గత రహదారులకు నాలుగు నెలల క్రితం ఈజీఎస్, ఎస్‌డీపీ నిధులతో మంజూరైన సీసీ, బీటీ రోడ్లకు నిబంధనలు పాటించకపోవడంతో పాటు చేయాల్సిన పనులు పూర్తి చేయకుండానే ఎంబీ రికార్డులు చేయించి నిధులు దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీసీ రోడ్ల పనులు పూర్తయిన తర్వాత కాంట్రాక్టర్ మొరంతో సైడ్ ఎర్తింగ్ పనులు చేయాల్సి ఉంటుంది. కానీ మండలంలో చేపట్టిన ఏఒక్క సీసీ రోడ్డుకు సైడ్‌ఎర్తింగ్ పనులు చేసిన ఆనవాలు లేవు. దీంతో ఎదురుగా మరో వాహనం వస్తే సైడ్ ఇవ్వడానికి కిందికి దిగే పరిస్థితి లేకుండా పోయిందని ప్రజలు మండిపడుతున్నారు. సీసీ రోడ్లు వేసిన తర్వాత క్యూరింగ్ అనంతరం ఇరువైపుల మొరం పోయించాల్సి ఉంటుంది. ఇది పూర్తయితన తర్వాతే అధికారులు పరిశీలించి ఎంబీ రికార్డులు చేసి పూర్తిస్థాయి బిల్లు విడుదల చేయాలి, కానీ మండలంలోని కొండనాగుల, బల్మూర్, వీరంరాజ్‌పల్లి, గోదల్, తుమ్మెన్‌పేట, చెన్నారం, అనంతవరం, బాణాల, అంబగిరి గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల పక్కన సైడ్ ఎర్తింగ్‌లకు మంగళం పాడారని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.



వీరంరాజుపల్లిలో సైడ్ ఎర్తింగ్ పనులు చేయకుండా వదిలేసిన సీసీ రోడ్డు

బీటీ రోడ్లదీ ఇదే పరిస్థితి..

మండలంలోని బాణాల, రామాజిపల్లి, నర్సాయపల్లికి నాలుగు నెలల కిత్రం పీఆర్ బీటీ రోడ్లు వేసిన నేటికి (షోల్డర్స్) ఇరువైపుల మీటరు దూరం మొరం వేసి డోజరుతో తిప్పాల్సి ఉంది. కానీ ఈ పనులు చేయకపోవడంతో వాహనాలు కిందికి దించలేని పరిస్థితి ఉందని డ్రైవర్లు విమర్శిస్తున్నారు. రోడ్ల పనుల్లో నిబంధనల ప్రకారం తమ పర్యవేక్షణలో పనులు చేయించాల్సిన అధికారులు కూడా కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పనులకు రికార్డులు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

కిందికి దిగలేని పరిస్థితి



మా గ్రామంలో మూడు నెలల క్రితం సీసీ రోడ్లు వేశారు. కాని సైడ్‌కు మొరం వేయకపోవడంతో వాహనాలు ఎదురు పడ్డ సమయంలో వాహనాలు, ఎడ్లబండ్లు కిందికి దించే వీలులేదు. దిగితే ప్రమాదం తప్పదు. మొరం వేసి ఇబ్బందులు లేకుండా చేయాలి.

– రాములు, వీరంరాజ్‌పల్లి

మొరం తప్పనిసరి వేయిస్తాం

ఇంతకు ముందు చేసిన పనులకు కొన్ని చోట్ల సైడ్ ఎర్తింగ్ పనులు చేయించలేదని గమనించాను. నేను అప్పట్లో లేను. వాటితో పాటు బీటీ రోడ్లకు ఇరువైపుల కూడా అక్కడక్కడ ఎర్తింగ్ పనులు పూర్తి చేయించలేదు. కాంట్రాక్టర్లతో వెంటనే పనులు పూర్తి చేయిస్తాను. కొత్తగా నిర్మించే సీసీ రోడ్ల పనుల్లో తప్పనిసరి సైడ్ ఎర్తింగ్ పనులు చేయిస్తాను. పూర్తి చేసిన పనులకే ఎంబీలలో రికార్డు చేస్తాం. చేయని పనులకు రికార్డులు చేయడం జరగదు.

– శ్రీనివాసులు, పీఆర్ ఏఈ, బల్మూర్

సిర్సనగండ్ల దేవాలయ అభివృద్ధికి కృషి



మట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ: సిర్సనగండ్ల సీతారామచంద్రాస్వామి దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఆదివారం జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్‌తో కలిసి ఎమ్మెల్యే దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనుల కోసం రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. సీఎం సహకారంతో దేవాలయం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం దేవాలయం ఆవరణంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బాల్‌రాంగౌడ్, లక్ష్మణ్, భీముడు, జగన్‌మోహన్, వెంకటయ్య, మధవరావు,, కొండలయ్య, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

కల్వకుర్తి: క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. మూడు రోజులుగా పోటీలు స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహించగా ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వంగూరు మండలం ఉపాధ్యాయులు మొదటి స్థానంలో, వెల్దండ మండలం ఉపాధ్యాయులు రెండవ స్థానంలో నిలిచారు. బ్యాట్మింటన్‌లో రవీందర్ మొదటి స్థానం, సాయిరమేష్ రెండవ, రవిభూషన్ తృతీయస్థానంలో నిలిచారు. సాయంత్రం బహుమతి ప్రధానోత్సవానికి క్లాస్‌మెట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్, ప్రధాన కార్యదర్శి రమేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో లక్ష్మీనరసింహరావు, శోభన్‌బాబు, రాజేందర్, రఘురాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ సామగ్రి అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల చెందిన కృష్ణయ్యకు ఇంటి నిర్మాణం కోసం ఇటుకలు, సిమెంట్, కడ్డీలు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆదివారం అందజేశారు. గతంలో మార్చాలకు వెళ్లినప్పుడు ఉండడానికి ఇల్లు కావాలని కృష్ణయ్య కోరడంతో, ఇంటి నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇంటి నిర్మాణ సామగ్రి అందజేశారు. పూరిగుడిసెలు లేని గ్రామాలను సిద్ధం చేసుకునేందుకు ప్రతి ఒక్కరు ముందు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గణేష్, కిశోర్, నాగరాజు, సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇంటి సామగ్రి అందజేస్తున్న సభ్యులు

హరితహారం మొక్కలకు నిప్పు



పెద్దకార్పాముల రోడ్డు వెంబడి కాలిపోయిన హరితాహారం మొక్కలు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల, నాయనోనిపల్లి మధ్య ఉన్న బీటీ రోడ్డు పొడవునా హరితహారం మొక్కలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో కాలి బూడిదయ్యాయి. ప్రభుత్వం రోడ్లకిరువైపుల హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తుంది. మొక్కలు పూర్తిగా కాలిపోయి ప్రభుత్వ లక్ష్యానికి నీరుకారిపోతున్నది. ఇదే కాకుండా నాటిన మొక్కలకు పలు గ్రామాలలో నీరు అందక ఎండుముఖం పడుతున్నాయి.

అసంపూర్తిగా శ్మశాన వాటికలు

తాడూరు: మండల కేంద్రతోపాటు ఆయా గ్రామాలలో నిర్మించిన శ్మశానవాటికలు అసంపూర్తిగా ఉన్నాయి. పల్లెప్రగతి కార్యక్రమాలలో భాగంగా గత ప్రభుత్వం ఎంతో హడావిడిగా నిర్మించినా ప్రారంభానికి నోచుకోలేదు. నిర్మాణాలపై నిర్లక్ష్యం వహించడంతో మండలంలోని 10 గ్రామాలలో అసంపూర్తిగా ఉన్నాయి. అధికారులు పరిశీలించి అసంపూర్తిగా ఉన్న శ్మశానవాటికలను పూర్తి చేసి ఉపయోగంలోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న శ్మశానవాటిక

ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలి



హోమం చేస్తున్న భక్తులు

తెలకపల్లి: ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలని ఉమాపతాచార్యులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని త్రిముఖ దుర్గాదేవి ఆలయం వద్ద మాఘఅమవాస్య పురస్కరంచుకుని ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకం అష్టోత్తరం, కుంకుమార్చన, హోమం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అర్చకులు మారోజు ఉమాపతాచార్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనలో ఉండి భక్తిభావంతో మెలగాలన్నారు. ప్రతి ఒక్కరు ఎంతో బిజీగా గడుపుతున్న తరుణంలో మనసుకు ప్రశాంతత అవసరం అన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే ఇలాంటి ప్రశాంతత సిద్ధిస్తుందని సూచించారు. భక్తులకు అమ్మవారి విశిష్ట వివరించి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సావిత్రిబాయిపూలేకి ఘన నివాళి



వెల్దండలో నివాళి అర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రస్తుత ప్రభుత్వాలు సావిత్రిబాయిపూలే ఆశయాల సాధనకు కృషి చేయాలని ప్రజా, కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పట్టణంలో సావిత్రిబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మనువాదం, మెజార్టీ ప్రజలకు ఆనాటి సమాజంలో చదువును నిషేదించిందని వేల ఏళ్ల వెనుకబాటుతనానికి కారణం అయితే నేటి ఈ నాగరిక సమాజానికి సావిత్రిబాయిపూలే అక్షర దివిటిని అందించిన సామాజిక విప్లవ మాతృమూర్తి అని కొనియాడారు. దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి మెజార్టీ ప్రజలకు చదువు నేర్పడానికి తుది శ్వాస వరకు ఆమె కృషి చేశారని తెలిపారు. ఆమె ఆశయాలకు తిలోదకాలు ఇస్తూ ప్రభుత్వాలు నూతన విద్యా విధానం పేరుతో ఉన్నత విద్యను దూరం చేసే కుట్రలు చేస్తున్నారని, ఆ మనుగడలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాదం ప్రవేశపెట్టేందుకు తహతహలాడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో అంతటి కాశన్న, ప్రణయ్, రాఘవ, నర్సింహ, కృష్ణయ్య, చంద్రయ్య పాల్గొన్నారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నిరంజన్, కుంభం మల్లేష్‌గౌడ్, నిరంజన్‌యాదవ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మల్లేష్, నూకం వెంకటయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో..



జిల్లా కేంద్రంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

కొల్లాపూర్: సావిత్రీబాయిపూలే ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివవర్మ, కేవీపీఎస్ మండల కార్యదర్శి బత్తిని రాజు అన్నారు. ఆదివారం పట్టణంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సమాన హక్కుల కోసం నినదించి, ఆచరించిన గొప్ప వ్యక్తులు పూలే దంపతులు అన్నారు. కార్యక్రమంలో గోవర్ధన్, జ్ఞానేందర్, ఆది రాజు తదితరులున్నారు.

ఘనంగా మల్లెలమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు



తెలకపల్లి: మండల కేంద్రంలోని జయశంకర్ చౌరస్తా వద్ద ఉన్న మేదరుల ఆరాధ్యదైవమైన మల్లెలమ్మతల్లి బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 19వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాలు, వడిబియ్యం వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, నారాయణ, బాలస్వామి, బాలరాజులు, సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ నీళ్ల ట్యాంకర్ బోల్తా

కోడేరు: మండలంలోని తాగూర్‌తండా చెందిన పంచాయతీ నీళ్ల ట్యాంకర్ బోల్తా పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎర్రన్నబావితండా పంచాయతీలో సీసీరోడ్డు పనులకోసం తాగూర్‌తండా పంచాయతీ ట్రాక్టర్ నీటిని తీసుకెళ్తుండగా ప్రమాదతశాత్తు రహదారిలో బోల్తా పడింది. డ్రైవర్‌గా ఉన్న మాజీ సర్పంచ్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ట్రాక్టర్ పూర్తిగా ధ్వంసమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై ప్రత్యేకాధికారి ఏఈ లక్ష్మిని వివరణ కోరగా పంచాయతీ ప్రతి వస్తువులపై పూర్తి స్థాయి బాధ్యత కార్యదర్శిదే అన్నారు. వివరాలు తెలుసుకుని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.



ముగిసిన ఉత్సవాలు

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురులోని దుందుబి వాగును అనుసరించుకుని ఉన్న రామలింగేశ్వర ఆలయంలో మూడు రోజులుగా నిర్వహించిన ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. పూజారి హనుమంతు ఆధ్వర్యంలో అభిషేకాలు, కలశ పూజలు, శివపార్వతుల కల్యాణం చేపట్టారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం ఉదయం తిర్మలాపూర్ సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ల డ్రైవర్లు సైదులు, వంగూరి సాయిపై కేసులు నమోదుచేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

పంచాయతీ వాటర్‌ఫిల్టర్ ప్లాంట్ ప్రారంభం

కోడేరు: మండల కేంద్రంలోని పంచాయతీ వాటర్ ఫిల్టర్‌ను మండల కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ కరీం, రంగినేని జగదీశ్వరావు ఆదివారం స్థానిక బస్టాండ్ వద్ద ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గతంలో పంచాయతీ నుంచి ప్రారంభించిన వాటర్ ప్లాంట్ చెడిపోవడంతో వెంటనే మర్మతులు చేసి ప్రారంభించినట్లు తెలిపారు.

వైభవంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

చారకొండ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరంచుకుని మండల కేంద్రంలోని శివాలయం, దుర్గమాత దేవాలయంలో ఆదివారం తెల్లవారుజామున గ్రామస్తులు పూల రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ నారోజు పార్థసారథి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్త భజన బృందం రథాన్ని ఆలయం చుట్టూ తిప్పారు. దుర్గమాత దేవాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే వంశీకృష్ణ, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ శివపార్వతులను, దుర్గమాతను దర్శించుకుని పూజలు చేశారు.

విరగబూసిన... 'మోదుగ' పూలు

బల్మూర్: హోలీ పండుగ అనగానే పూర్వం నుంచి గుర్తుకు వచ్చేది మోదుగ పూలు. వసంత కాలంలో ప్రతి హోలీ పండగకు ముందు మోదుగ చెట్లకు ఎర్రటి రంగులో పూలు కాసి ఎంతో ఆకర్షణీయంగా కనువిందు చేస్తాయి. ఈ పూలనే పూర్వం హోలీకి రంగుగా ఉపయోగించి ఒకరి ఒకరు చల్లుకొనే వారు. ప్రస్తుతం హోలీ దగ్గర పడుతుండటంతో పొలాల్లో పూలు కనువిందు చేస్తున్నాయి. మండలంలోని మైలారం సమీపంలో ఓ పొలంలో పూలు విరగబుసి రోడ్డుపై వచ్చిపోయో వారిని కనువిందు చేస్తున్నాయి.



మైలారం సమీపంలో కనువిందు చేస్తున్న మోదుగ పూలు